# మా ఆవిడ - చిట్టికవిత

"ఏమండి! నేను కొన్ని చిట్టీలు రాస్తాను" అంది మా ఆవిడ ఒకనాడు.

"చిట్టీలు ఏంటమ్మా, ఏమి చిట్టీలు రాస్తావ్, నకలు చిట్టీలా?" అని అడిగాను అర్థంకాక.

"లేదండి అలాంటి చిట్టీలు కావు. చిట్టి పొట్టి కవితలండి" అంది నాకు దగ్గరగా వచ్చి గోముగా.

"వామ్మో!... నువ్వు కవితలు రాస్తావా?" అన్నాను ఆశ్చర్యంగా. "ఏం రాయకూడదా, మీరు రాయగా లేనిది నేను రాస్తే తప్పా?!" అంది.

"రాయచ్చు. తప్పేమిలేదు, మరి వాటిని చిట్టీలు అంటున్నావేంది?" అన్నాను.

"చిట్టి చిట్టి కవితలు కాబట్టి చిట్టీలు అన్నాను, పొట్టి పొట్టి పొట్టి కవితలను పొట్టీలు అన్నట్లు..." సమాధాన మిచ్చింది.

"ఓహో! అలానా! నువ్వు పొట్టీల కవయిత్రివి అయి పోతావన్నట్లు, పైగా నువ్వు పొట్టిగా ఉన్నావు కాబట్టి కూడ" అన్నాను నవ్వుతూ.

"అట్లంటారేంటండి నన్ను, ఈ పొట్టి కవితలు రాయడం చాలా ఈజీ, మన ఊళ్ళోనే ఉన్నారు కదండి నాల్గు డజన్ల పొట్టీల కవులు, ఇవ్వాళ కవి కావడం, కవిత్వం రాయడం చాలా ఈజీ వ్యవహారం. పైగా నేను రాసిన పొట్టీలను సవరించడానికి నాకు అండగా మీబోటి పెద్ద కవులు వున్నారు కదండి. ఇక రాసేస్తాను" అంది భరోసాతో.

"సరే మంచిది, నిన్నెందుకు నిరుత్సాహపరచాలి. కవిత్వం మేడ్ ఈజీలా ఉంది కాలం. రాసేయ్" అన్నాను ఆజ్ఞపూర్వకంగా. కాని మా ఆవిడ కవిత్వం ఎలా రాస్తుందో చూడా లనుకొన్నాను. ఆమెకు వాస్తవానికి ఇంటి పని చేయడా నికే తీరిక ఉండదు, మరి కవిత్వం ఎప్పుడు రాస్తుందో అనిపించింది!

ఒకనాడు మా ఇంట్లో జామచెట్టు దగ్గర నిలు చున్నాం ఇద్దరం. జామకాయలు తెంపడానికి.

"అదిగోనండి జామకాయ తెంపండి" అంది మా ఆవిడ జామకాయను చూపిస్తూ,

నాకేమో జామకాయ ఎక్కడుందో సరిగ్గా కనిపించ డం లేదు. అదే విషయం చెప్పాను మా ఆవిడతో. ఆమెకు బుస్సున కోపమచ్చింది,

"గుడ్డి కళ్ళు
ఏమి కనిపించవు
ఒక్క
ఆడాళ్ళు తప్పు!" అని అంది మా ఆవిడ నా గుండె ల్లోకి గుచ్చినట్లుగా.అమ్మ బాబోయ్! నాకే కొట్టింది పెద్ద దెబ్బ! అలా పుట్టింది మా ఆవిడ మొట్టమొదటి చిట్టికవిత జామ చెట్టు దగ్గర!

అసలు మా ఆవిడకు చిట్టి కవితలు రాయడానికి ప్రేరణ నిచ్చింది మా ఊళ్ళోని కాళిదాసు అనే ఓ కవి. ఆ కాళిదాసు ఒకనాడు మా ఇంటికి వచ్చి తను రాసిన చిట్టికవితలతో ఓ పుస్తకం వేస్తూ, నన్ను ఆ చిట్టి కవిత లపై మాట్లాడవలసిందిగా ఆహ్వానిస్తూ, మా ఆవిడకు అడుగకుండానే ఓ ఉచితసలహా పారేసి పోయిండు, మీరు కూడా చిట్టి కవితలు రాయండి అని. చిట్టికవి తలు రాయడం చాలా ఈజీ అనే ఆయన సూచనను తూ.చ. తప్పకుండా పాటించాలనుకొందేమో మా ఆవిడ చిట్టి కవితలు రాయడానికి ఉపక్రమించింది.

ఆమె చిట్టి కవితలకు మొదటి శ్రోతను నేనే! ఏకంగా నాలుగైదు రోజుల్లోనే నలభై యాభై చిట్టి కవితలు రాసింది. రాసిందే తడవుగా వాటిని నాలుగైదు పత్రిక లకు పంపించింది. పంపిన రెండు, మూడు నెలల్లోనే అవి పత్రి కల్లో అచ్చయినాయి. తొలి రోజుల్లో తొమ్మి దేళ్ళలో నావి తొమ్మిది కవితలు కూడా అచ్చుకాలేదు గాని. మా ఆవిడ మాత్రం నాలుగైదు నెలల్లోనే చిట్టీల కవయిత్రి అయి కూర్చుంది. పత్రికల్లో మా ఆవిడ చిట్టి కవితలని చదివి లేఖలు రాసిన చిట్టి కవితల పెద్ద కవులు న్నారు, ఆశీర్వ దిస్తూ సూచనలు చేస్తూ అభినందించిన

సబ్బని లక్ష్మీనారాయణ

సీనియర్ కవి మిత్రులున్నారు.

ఇక ఆమధ్యలో మా ఊళ్ళో కవయిత్రుల సమ్మేళనం అని జరిగింది. దానికి మా ఆవిడ గారిని ఆహ్వానించారు. ఆ సభలో కలెక్టర్‌గారి సతీమణి జిల్లాలోని కవయిత్రులకు సన్మానం చేస్తూ మా ఆవిడగారిని కూడా సన్మానించారు. ఇవన్నీ చూస్తూ మా ఆవిడ ఆశ్చర్యపోయారు! నేనేమిటి! చిట్టీలు రాయడం ఏమిటీ! అని. అలా కాలక్రమంలో మా ఆవిడ చిట్టీలు రాస్తూనే ఉంది. ఆమెరాసే చిట్టీలు అన్ని ఆమె కళ్ళముందట కనిపించేవే, అనుభవంలోకి వచ్చిన విషయాలే! కొన్ని దెప్పిపొడుపుగా, వ్యంగ్యంగా రాసింది. హాస్యంగాను రాసింది. ఒకనాడు ఆమె బట్టతల వాళ్ళను చూస్తూ ఓ చిట్టీచెప్పింది.

''బట్టతలే
భాగ్యమన్నారు
మరిదానికి
ముసుగెందుకు?'' అని.

నిజమే! కాబోలు! పత్రికల్లో ఈ చిట్టీ చదివి ఏమో, ఎప్పటికీ బట్టతలపై టోపి పెట్టుకొనే ఓ మిత్రుడు బట్ట తలపై టోపి పెట్టడం మానేసాడు. ఇంకోనాడు ఆమె తలలోని పేనుపై ఓ చిట్టీ చెప్పింది.

''ఈ పేనుది
ఎంత భాగ్యం
తలపైనే
నివాసమేర్పరచుకొంది'' అని.

ఆమధ్యలో నేను రామేశ్వరం వెళ్ళివచ్చాను. నాలో ఏమి మార్పు గమనించలేదేమో! నాపైనే ఓ చిట్టీ చెప్పింది!

''రామేశ్వరం పోయినా
శనేశ్వరం పోలేదు
గుండు గీసుకున్నా
చుండు పోలేదు'' అని.

మా ఆవిడ చిట్టి కవితలకు ఒకోసారి నేనే కావ్యవస్తువును. నేను తరచుగా కవి సమ్మేళనాలకు వెళ్ళి వస్తుంటాను. వెళ్ళివచ్చినప్పుడల్లా ఒక తువ్వాలో, చేతి రుమాలో తెచ్చుకొంటాను నిర్వాహకులు సత్కరిస్తే, ఆ విషయాన్నే చెపుతూ...

''కవిత్వమంటే మాటలా?
కవులకు
కండువాలకు
కొదువేలేదు'' అని చిట్టి కవిత చెప్పింది.

ఆమె చిట్టి కవితల విషయంలో గురువులను కూడా వదిలిపెట్టలేదు, వక్ర బుద్ధులైన గురువులను చూస్తూ.

''చదువు చెప్పమంటే
సైట్ గొట్టవట్టె
గురుబోధ
ఇదేనా?'' అని. మా ఆవిడ ఇంకోనాడు ఉన్న ఫళంగా బాంబ్‌లాంటి చిట్టి కవిత పేల్చింది.

''ఆమెకు
ఇద్దరు కాదు ముగ్గురు
కుటుంబ నియంత్రణ
లేదు'' అని.

''అంటే ఏంటమ్మా'' అని అర్థంకాక అడిగాను.

''ఏమి లేదు విపరీతం! పిల్లలుఇద్దరు కాదు ముగ్గురు అన్నాను. బాగుంది కదండి బాంబ్‌లా'' అంది.

''చాలు తల్లి, నీ చిట్టి కవితలు- నీ కవితలు ఎవర్ని నొప్పించకూడదు మరి'' అన్నాను.

''నేనెందుకు నొప్పిస్తాను.కాదేది కవిత కనర్హం అన్నారు మన శ్రీశ్రీ... అందుకే రాసేసాను'' అంది ధైర్యంగానే.

''సరే! నీ కవిత్వం నీ ఇష్టం... మరి లోకానికి నచ్చద్దు'' అన్నాను. ''నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు... నేనైతే రాస్తున్నాను'' అంది.అలా అలా మా ఆవిడ చిట్టీల కవయిత్రిగా పేరుగాం చింది ఒక సంవత్సరంలోనే. అయేటి చివరి నాటికి చిట్టిల కవులందరు కలసి ఓ వార్షికోత్సవం జరుపుతున్నామని అందుకు రావసలిందిగా మా ఆవిడకు ఆహ్వానం వచ్చింది. ఆ యేటి ఉత్తమ చిట్టిల కవయిత్రిగా సన్మానిస్తున్నామని తప్పక రావలసిందిగా రెండవ ఆహ్వానం కూడా వచ్చింది.''ఏమండి! మనం వెళ్దామండి... మీరు రావాలె నాతో'' అంది.

''నేనెందుకు నన్ను పిలువలే వాళ్ళు నిన్నే పిలిచారు. మన బాబును తీసుకొని వెళ్ళు'' అన్నాను.

''మీరు రావలంటే నేను రాలేదా మీతో తిరుపతికి మీకు సన్మానం చేసినపుడు''అని ప్రాధేయంగా అడిగింది.

అలా ఆమెతో ఆ చిట్టి కవుల వార్షిక సభలకు వెళ్ళాను. ఆమెకు అక్కడ ఆ యేటి చిట్టిల కవయిత్రి అని బిరుదునిచ్చి ఘనంగా సన్మానించారు.

మా ఆవిడను, ఆవిడ చిట్టి కవితలను చూస్తుంటే 'కవిత్వం మేడ్ ఈజీ, దటీజ్ చిట్టీ' అని అనిపించింది.

ఇంకా మా మిత్రుడు చెప్పిన చిట్టి కవిత కూడా జ్ఞాపక మొచ్చింది.

''కవిత్వమంటే మాటలా?
అయితే
ఆంధ్రప్రదేశ్‌లోని
అందరు కవులే'' అని. ■